# నియమాతీతమ్

శ్రీమతి ఆర్. వసుంధర

హైదరాబాదు వెళ్లే రైలువచ్చి బెజవాడస్టేషన్‌లో ఆగింది. ఆడవాళ్ల సెకండ్‌క్లాస్ పెట్టెలో ఎక్కింది సుశీల. మిగతా పెట్టెలన్నీ క్రిక్కిరిసి వున్నాయి. రెండే బెర్తులున్న యీ చిన్నపెట్టె మాత్రం బాగా ఖాళీగా వున్నది. ఎదుటి సీట్లో ఒక లావుపాటామె సామాన్లన్నీ సీటుమీద పరిచి పెట్టుకొని కాళ్లు రెండూ సీటుమీదనే విశ్రాంతిగా ముడుచుకొని కిటికీలో మోచెయ్యి ఆనించుకొని తాపీగా బయటకు చూస్తూ కూర్చున్నది. సుశీల ఎదుటిసీటుమీద హోల్డాలు పరిచి బాబును పడుకోబెట్టి జుట్టు సర్దుకొని కూర్చున్నది. రాత్రంతా జాగరణ చెయ్యకుండా హాయిగా పడుకోడానికి చోటు దొరికినందుకు సంతోషించింది.

రైలు బయల్దేరాక ఎదుటి సీట్లో ఆమెను 'ఎక్కడికి వెళ్తున్నారు' అని ప్రశ్నించింది.

'ఖమ్మం' అన్నదామె.

ఆమె దిగి వెళ్లిపోతే తాను ఒక్కత్తెనే అయిపోతానని తోచగానే సుశీలకు అమ్మ చెప్పిన జాగ్రత్తలన్నీ గుర్తుకొచ్చినై. 'ఆడవాళ్ల పెట్టెలో ఎక్కవద్దు. కష్టమైనా మగవాళ్లపెట్టెలో ఎక్కడమే మంచిది. ఒంటిగా అసలు వుండరాదు' అని ప్రతిసారీలాగానే గట్టిగా చెప్పింది అమ్మ. 'జాగ్రత్తలు చెప్పడమైతే చెప్పారుగాని ఎవరైనా బెజవాడవరకూ వచ్చి రైలెక్కించలేకపోయారు! పనివాణ్ణి పంపినా సరిపోయివుండేది. వాళ్ల కోపతాపాలేగాని నా సంగతి పట్టలేదు' అని విసుక్కుంది. 'వచ్చి పది రోజులు కాలేదు. ఇంతదూరంవచ్చి అంతలోనే వెళ్లకపోతేనేం? యింకో పదిరోజులుండి సంక్రాంతి వెళ్లాక వెళ్లవచ్చును. విశా ఆయన్ని పండక్కి రమ్మని వ్రాయి. యిద్దరూ కలిసి వెళ్దురుగాని. పిల్లవాడితో ఒక్క దానివి వెళ్లలేవు' అన్నారు అమ్మా, నాన్నా. అసలే అక్కడ తగవులాడి వచ్చివుండటాన, ఆయన ఘట్టిగా రమ్మని వ్రాసినప్పుడు వెళ్లకపోతే బాగుండదనే వుద్దేశ్యంతో మొండిగా బయల్దేరింది సుశీల. రైలెక్కించడానికి వాళ్లకు వీలుకాలేదు. 'ఇంత చదువుకొని ఎన్నో ప్రయాణాలు చేసినదాన్ని. బాబు వున్నాడనిగాని లేకుంటే నాకు యిదంతా ఒక లెఖ్ఖా!' అనుకుంది సుశీల.

'పిల్లాడి కెన్నోయేడూ?' దీర్ఘంతీస్తూ అడిగింది ఎదుటి సీట్లో ఆవిడ.

'మూడు నిండింది.'

ఎవరడిగినా అయిదో సంవత్సరమని చెప్పమనీ లేకుంటే దిష్టి తగుల్తుందనీ తల్లి చెప్పిన విషయం గుర్తున్నా అబద్ధం చెప్పడానికి అలవాటూ యిష్టమూ లేక నిజమే చెప్పింది సుశీల. ఒకసారి ఎవర్తోనో పిల్లాడికి అయిదు వెళ్లిందని చెప్పింది తల్లి. పొడుగు పిల్లాడు కావటాన చూడటానికి కాస్త నదురుగా వున్నా మొహంలో పసితనం కనిపిస్తోంది. వాళ్లు నిజం వూహించి 'యీవిడ అబద్ధం చెబుతున్నది' అనుకుంటారేమోనన్న భయం వున్నది సుశీలకు. అబద్ధాలు చెప్పేవాళ్లంటే సుశీలకు అసహ్యం.

'టక్‌టక్' మన్న శబ్దంతో పరధ్యానంనుండీ బయటపడింది సుశీల. టికెట్‌కలెక్టరు వచ్చి పెన్సిలుతో పై బెర్తుమీద టకటక శబ్దం చేస్తున్నాడు. 'టికెట్స్' అన్నాడు. సుశీల పర్సులోంచీ తన టికెట్ తీసి చూపించింది. 'పిల్లవాడికి?' అన్నాడు. 'వాడికి మూడేళ్లే' అన్నది సుశీల సగం విసుగూ సగం గర్వం కలిసిన గొంతుతో నిర్లక్ష్యంగా. 'మూడు నిండిందా?' అన్నాడు టీసీ. 'అవును...' అన్నది సుశీల. టీసీ మొహంలో చిన్ననవ్వు - కన్పించింది.

దొంగను పట్టుకున్న పోలీసు దర్పమూ, అజ్ఞానుల యెడల తెలిసినవాళ్ళు చూపే పెద్దరికపు ఠీవీ ఒలక బోస్తూ 'చూశారా మరి...మూడు నిండితే అర టికెట్ కొనాల్సిందే...రూల్స్...ఇక్కడ ఫరవాలేదు గాని పైకిపోతే అక్కడ చెకింగు గట్టిగావుంటుంది. పిల్లవాడి వయస్సడిగితే మూడో సంవత్సరం అని చెప్పండి...' అని సలహా యిచ్చాడు వుదారంగా. కాస్త పెద్దపిల్లలకు అరటికెట్ కొనాలని తెలిసినా మరీ మూడేళ్లకే కొనాలన్న విషయం బాగా ప్రకటించనందుకు రైల్వేవాళ్లమీదా, తెలుసుకోనందుకు తన మీదా చీకాకు కలిగింది సుశీలకు. కాని యీ విషయంలో టీసీ నానాహంగామాచేసి ఫైను వేయనందుకు చాల సంతోషించింది. 'అలానేనండి...' అంటూ తల వూపింది కృతజ్ఞతతో. ఎదుటి సీటావిడ టికెట్ చూసి వెళ్లిపోయాడు టీసీ.

ఆమె లేచి సామాన్లు సర్దుకోవటం ప్రారంభించింది. 'మీరు దిగిపోతే నే నొక్కర్తెనే అయిపోతాను... వే రెవరైనా ఎక్కుతారో లేదో' అన్నది సుశీల. 'ఎవరూ లేకుంటే మగవాళ్ల పెట్టెకు మార్చుకోండి. కాలం మంచిదికాదు' అన్నదామె. ఆమె దిగిపోయాక డోర్నకల్‌వరకూ ధైర్యం చిక్కబట్టుకొని తలుపులూ కిటికీలూ వెయ్యి కళ్లతో చూస్తూ కూర్చుంది సుశీల. అక్కడా క్రొత్త వాళ్లెవరూ ఎక్కలేదు. అప్పుడు కూలీని పిలిచి సామాన్లతో మగవాళ్ల పెట్టెలోనికి మార్చుకున్నది.

మగవాళ్ల పెట్టెలో రద్దీ జాస్తిగా వున్నది. నిద్ర విషయంలో ఆశ వదిలేసిన వాళ్లలా అందరూ గుంపులుగా కూర్చొని మాట్లాడుకుంటున్నారు. ఒక సీట్లో ముగ్గురు మగవాళ్ల ప్రక్కగా కిటికీ దగ్గరగా చోటు దొరికింది సుశీలకు. వాళ్లకూ తనకూ మధ్యగా బాబును కూర్చోబెట్టి తాను కిటికీ ప్రక్కగా కూర్చున్నది. బాబుకు నిద్ర ముంచుకొస్తున్నది. సుశీలకు ఏంచెయ్యాలో తోచలేదు. ఇంతలో బాబుప్రక్కనున్నాయన 'ఎక్కడన్నా ఖాళీ వున్నదేమో చూసొస్తాను' అంటూ ప్లాట్‌ఫారంమీదికి దిగి వెళ్లాడు. రెండు నిముషాల్లో తిరిగి వచ్చి 'ప్రక్కన ఆడవాళ్లపెట్టె ఖాళీగా వున్నది. ఎవరైనా వచ్చి దింపేవరకూ అక్కడ హాయిగా పడుకోవచ్చు' అని ప్రక్కనున్నాయనతో చెప్పాడు. ఇద్దరూ చేతి సంచులు పుచ్చుకొని దిగి వెళ్లిపోయారు. ఒక్క క్షణం అయినా వృథాచెయ్యకుండా ఖాళీఅయినచోటులో హోల్డాలు పరిచేసింది సుశీల. సీట్లో ఆ చివర్న మిగిలిపోయి నతను కొంచెం కోపంగా చూసి మొహం తిప్పేసుకున్నాడు. మాటల్లో మునిగివున్నవాళ్లలో కొందరు కూడా తిరిగి చూశారు. 'ఆడవాళ్ల అఘాయిత్యం యిల్లా వుంది' అన్నభావం అంతటా కన్పించింది సుశీలకు. అయినా లెక్కచెయ్యకుండా నిద్రతో తూలుతున్న బాబును సుఖంగా పడుకోబెట్టి ప్రక్కన కూర్చొని విసరటం ప్రారంభించింది. బాబు నిద్రపోయాడు. సీట్లో ఆ చివర కూర్చున్నతను కునికిపాట్లు పడుతూ వుండుండి తల విసురుగా ముందుకు వాలిపోతుంటే సర్దుకుంటున్నాడు. ఎదుటిసీట్లోవాళ్ళ కిటికీలో తల పెట్టుకొని ఒకరూ, ఒళ్లో వున్న సంచీమీద ముఖం ఆనించుకొని ఒకరూ కునుకుతీస్తుంటే మూడో ఆయన ఆ గుడ్డివెలుతురులో ఏదో పుస్తకం చదువను ప్రయత్నిస్తున్నాడు. బాబును కాస్త ఒత్తిగించి ప్రక్కనే పడుకుంది సుశీల. రైలు కుదుపుకు హాయిగా నిద్ర పట్టేసింది.

నిద్రలోని నిశ్శబ్దంలోనుండి ఏదో గందరగోళంలోనికి మెలకువ వచ్చినట్లయింది. బయటి చీకటీ, పెట్టెలోని గుడ్డిలైట్లూ అలానే వున్నై. రైలు ఆగివున్నది. 'కాజీపేట...కాజీపేట' అంటున్నారు. అ వైపున ప్లాట్‌ఫారంమీద మసగ వెలుతురులో మనుష్యులు నడుస్తున్నారు. 'గరమ్ చాయ్... చాయ్...చాయ్' అన్న కేకలు విరామం లేకుండా విన్పిస్తున్నాయి. 'హాట్ చాయ్...వన్ పాట్' అంటూ ఎవరో అవతలి సీట్లోంచీ ఆర్డరిచ్చారు. పెట్టెలోని మనుష్యులందరూ మాట్లాడుతున్నట్లుగా సందడిగా వున్నది. సుశీల లేచి కూర్చున్నది. సీట్లోని ఆ చివరాయన సంచీ పట్టుకొని కునికిపాట్లు పడుతూనే వున్నాడు. ఎదుటి సీట్లోనివాళ్ళు నిద్రాభారంతో ఎర్రబడ్డ కళ్లను మూస్తూ తెరుస్తూ అప్పుడప్పుడు ఒక్కోమాట మాట్లాడుకుంటున్నారు నెమ్మదిగా. ప్లాట్‌ఫారంవైపుగావున్న పొడుగాటి పై బెర్త్‌మీద హోల్డాలులు పరుచుకొని వున్నవాళ్లు యిద్దరు

పెద్దగా మాట్లాడుకుంటున్నారు. సంభాషణను బట్టి యిద్దరూ డాక్టర్లని గ్రహించింది సుశీల. 'కాలేజ్‌లో నీ Performance బట్టి ఎంతో పైకి వస్తావనుకున్నాం. పల్లెటూరి డాక్టరువైపోతావనుకోలేదు. సర్జరీ ప్రొఫెసర్ నిన్ను చాల మెచ్చుకునేవారు' అన్నాడు సన్నగా చామనచాయలోవుండి కళ్ల జోడు పెట్టుకున్నాయన. మంచితనంతోపాటుగా జీవితంలో యిహ తెలుసుకోదగ్గదేమీలేదన్న నిర్లిప్తత కనిపిస్తున్నది అతని మొహంలో. జుట్టు సగం తెల్లబడిపోయింది. అతని బట్టలు అప్పుడే మంచిచాకలి తెచ్చియిచ్చినవాటిలా మెరుస్తున్నవి. మనిషి శుభ్రంగా వున్నాడు.

పల్లెటూరి డాక్టరు కొంచెం బొద్దుగా పొట్టిగా వున్నాడు. శరీరం తెల్లగావుండి లైటు వెల్తురులో మెరుస్తోంది. బట్టలు తెల్లగావున్నా నలిగివున్నాయి. సోమరిగా దిండుమీదకు సగం వాలి సిగరెట్టుపొగ వదిలి పెద్దగా నవ్వాడు మిత్రుడి మాటలకు. 'నాకేం లోటు వచ్చిందంటావ్? సుఖంగా వున్నాను...మూడువాళ్ల ముచ్చటలాంటి బ్రతుకును Ambition లో మసిచేసుకుని సరదాలేకుండా బ్రతకాలని యిష్టంలేదు' అన్నాడు ఆప్యాయంగా స్నేహితుణ్ణి చూస్తూ...

పొడుగాటి క్రిందబెర్తులో అవతలి 'సగం ఆక్రమిస్తున్న ముగ్గురు మనుష్యులు చర్చలో మునిగి వున్నారు. ఈ చర్చ నిద్రను జయించే ప్రయత్నమైతే అది నెరవేరిందనే చెప్పాలి. అప్పుడప్పుడు ఆవలింతలు రావడం మినహాగా వాళ్ల మాటల్లోగాని మొహాల్లోగాని నిద్రతాలూకు ఛాయలేమీ లేవు. 'గురువుగారికి నియమనిష్ఠలూ ఆచారంమీద పట్టింపూ వున్నాయి. వర్ణాశ్రమధర్మాలు ప్రధానం అంటారు...' అన్నాడు పొడుగ్గా సన్నగా తెల్లగా వున్నాయన కనుబొమలెగరేస్తూ. పొట్టిగా లావుగావుండి కాషాయబట్టలు ధరించిన ముసలాయన క్రిందికి చూస్తూ 'నారాయణ...నారాయణ...' అని తలూపాడు. వాళ్ల మాటలన్నీ శ్రద్ధగా వింటున్న మూడో అతను 'మా వూరి ఆశ్రమంలో అమ్మగారున్నారు. ఆమెకు యిహా ఆచారాల పట్టింపులేదు. కులాల పట్టింపూలేదు. అక్కడ అందరికీ ఏకపంక్తి భోజనమే...' అన్నాడు. ఇంకా చెప్పబోతూవుండగా మిగతా యిద్దరూ సాభిప్రాయంగా ఒకరినొకరు చూసుకుని నవ్వుకున్నారు. అనాసక్తతను వ్యక్తపరుస్తూ పొడుగాటాయన ఆవులించాడు. మూడో అతను యిది గమనించి 'ఆమె సాక్షాత్తూ ఆదిశక్తి అంటున్నారు...' అని ముగించి కాళ్ళు సర్దుకున్నాడు. అప్పుడు అతని కాళ్లను గమనించి ఆశ్చర్యపోయింది సుశీల. అతని కాలు ఒకటి రెండోదానికి రెట్టింపు లావులో వున్నది. దానిమీద గుడ్డ కప్పుకున్నాడు. బోదకాలైతే పాదంవరకో మోకాలువరకో వుబ్బటం చూసిందిగాని యిలాగ కాలు కాలంతా ఒకేలావు కావటం చూడలేదు. సుశీలకు అతనిమీద జాలి కలిగింది. 'పాపం, ఆ కాలు ఎలా మోస్తున్నాడో' అనుకున్నది. వాళ్లు మళ్లీ గురువుగారి కబుర్లలో పడిపోగా లావుకాలతను వాళ్ల మాటలను శ్రద్ధగా వింటున్నాడు...

అదే సీటులో యింకో వైపున ఇద్దరు స్టూడెంట్సు కాబోలు సినిమాల గురించి మాట్లాడుతున్నారు!

కొంచెం ముందరగావున్న చిన్నసీట్లో యిద్దరున్నారు. ఒకతను నిద్రలేక ఎర్రబడ్డ కళ్లతో దీనంగా వున్నాడు. సీట్లో ఖాలీచాలని చోటులో యిరుక్కొనికూర్చున్నాడు. మిగతాచోటంతా హోల్డాలుపరుచుకొని దానిమీద కూర్చొని వున్నతను ముందర షేవింగు సామాన్లు పరిచిపెట్టుకొని మొహంనిండా దట్టంగా సబ్బు పట్టించి, తెల్లటి సబ్బు నురగలోనుంచి మాట్లాడుతున్నాడు. నలభైఏళ్లకు పైవయసులో లావుగా నల్లగావున్నాడు. హాయిగా నిద్రపోయిలేచినట్లున్నాడు. నిద్రలేక బాధపడుతున్న మనిషితో వుత్సాహంగా పెద్దగా వెయిన్‌కోట్ దొరగారిగురించి చెబుతున్నాడు. మాటల్లో యితనిపేరు జేకబ్ అని తెలిసింది. 'క్రైస్తవమత ప్రచారకుడిలావున్నాడు' అనుకున్నది సుశీల. రెండో అతను నిద్రపోనూలేక పోకుండానూలేక సతమతమౌతూ యితను చెబుతున్న దానికి బాధగా తలూపుతున్నాడు

ఇంతలో 'టీ, సర్' అన్నారు బయటనుండీ. పొడుగు సీట్లోని స్టూడెంటు 'ఇల్లా తేవోయ్' అన్నాడు. జేకబ్ ఆత్రంగా 'నేను ఆర్డరిచ్చింది... Bring it here...Is it hot?' అన్నాడు. బేరర్

'yes, sir' అంటూ ట్రే తెచ్చి అతని ముందు పెట్టాడు. జేకబ్ మాటలూ చేష్టలూ రూపమూ చూస్తుంటే సుశీలకు చీకాకుపుట్టింది. 'ఆ సబ్బు నురగలోంచే పాచి నోటితోనే తాగేస్తాడు కాబోలు!' అనుకుంది విసుగ్గా. అల్లానే ఒకచేత్తో రేజర్‌పట్టుకొని రెండోచేతిలోని కప్పులోని కాఫీని చప్పరిస్తూ నిద్రలేకుండా యిరుక్కు కూర్చున్నతనితో అమెరికాలోని లూథరన్‌మిషన్‌చేస్తున్న సేవను తనే చేస్తున్నట్లుగా చెప్తున్నాడు జేకబ్.

సుశీలకు విసుగేసి కిటికీలోంచీ బయటకు చూస్తూ కూర్చుంది. హైదరాబాదు దగ్గరకు వస్తున్నదంటే మనసంతా కలవరమైపోయింది. ఎంత పోట్లాడి మొండిగావచ్చేసింది తాను! అత్తగారిని స్వగ్రామానికి పంపించేస్తేకాని యింట్లోవుండనని పంతంపట్టి వచ్చేసింది. తరువాత ఏం జరిగిందోగాని ఆమె వెళ్లిపోయిందని వ్రాశాకనే తాను తిరిగి బయల్దేరింది! భర్త స్టేషన్‌కువస్తే మొహం ఎలా చూపేదా అని మథనపడసాగింది సుశీల. ఆమెకు కొడుకు తప్పించి వేరే సంతానంగాని కావాల్సినవాళ్లుగానిలేరు. అలాగని కొంచెం సరుకుపోవచ్చునా? అలాంటిదేమీలేదు. తనకెంతతోస్తే అంత! ఆవిడకి మంచీచెడ్డా, నిజం అబద్ధం, నీతీనిజాయితీలాంటివేవీ లేవు. తాననుకున్నది జరగటం తప్పించి మరే నియమాలూ ఆమెకులేవు. అబద్ధాలు మంచినీళ్ల ప్రవాహంలా దొర్లుకొస్తాయి ఆమె నోట్లోంచి. కాన్వెంటు వాతావరణంలో క్రమశిక్షణలో నిజంలో నిజాయితీలో పెరిగిన సుశీలకు యిది ఏమాత్రం సరిపడలేదు.

చాకలిబట్టలు చించుకొస్తున్నదని ఆమెకు కోపంగా వున్నది. దాన్ని మానిపించి వేరే చాకలిని పెట్టమన్నది. చాకళ్లందరూ అలానేవున్నారనీ, మార్చినందువలన కలిగే లాభం ఏమీలేదనీ కొడుకు చెప్పినది ఆమెకు నచ్చలేదు. అసలే ఆలస్యంగా బట్టలు తెచ్చిన చాకలిని 'పద్దు కనపడలేదు, రేపు రమ్మని' పంపించివేసి, కొడుకు యింటికిరాగానే 'ఆ పాడు చాకలి యింకా బట్టలు తేలేదురా...మరీ యింత అన్యాయమైపోతే ఎలా...వేరే చాకలినిపెట్టుకుంటేగాని కుదరదు' అంటూ పోధింపు ప్రారంభించింది.

ప్రక్కింటి సుందరమ్మగారికీ యీమెకూ సరిపడదు. వాళ్ల పాలమనిషి మంచిది. మిగిలిపోయిన పాలన్నీ రోజూ వూరికే 'కొసరు' పోసేసి వెళ్తుంది. అది యీమెకు సహించరానిదైంది. ఆ పాలమనిషిని చాటుగా పిలిచి 'నీకు తాంబూలానికి రోజూ ఒక అణాయిస్తానుగాని మిగిలిపోయిన పాలు మాకు పోసి వెళ్తూండు' అనడిగింది. ఆ విషయం తెలిసి సుందరమ్మగారు సుశీలకు ఫిర్యాదుచేసింది...ఇలాగ ప్రారంభమైంది అత్తా కోడళ్ల మధ్య కలత. ఇదేమని అడిగితే అలిగిపడుకుంటుందిగాని తన బుద్ధి మార్చుకోదు, తెలుసుకోదు. సుశీల స్నేహితులతో 'మాకు వందెకరాల మాగాణి వున్నద'నీ 'లంకంత యిల్లు వున్నద'నీ చెప్పింది. అసలు విషయం ముందుగానే సుశీలద్వారా వినివున్నవాళ్లు చాటుగా నవ్వుకోవటం, ఆమెచేత యింకా అబద్ధాలు చెప్పించాలని ప్రయత్నించటం సుశీల గమనించింది.

ఒకనాడు సుందరమ్మగారు పెద్ద స్టీలు గిన్నె పోయిందని తెగ వెతుక్కున్నారు. అత్తగారు బయటే తీరుబాటుగా కూర్చొని 'యింట్లోనే ఏమూలో వుంటుంది, సరిగా చూసుకోండి' అన్నది కూడాను. రెండురోజుల తరువాత సుశీల చాకలికి బట్టలు వెయ్యడానికి వెడితే బట్టల క్రిందవున్నది ఆ స్టీలు గిన్నె. సుశీలకు చాలాకోపంవచ్చింది. 'ఆ గిన్నె మన వాకిట్లోపడవేసివున్నది. అంత అశ్రద్ధ అయితే ఎల్లాగంట? రెండురోజులు వెతుక్కుంటే బుద్ధి వస్తుందని దాచేనులే' అన్నది అత్తగారు. దానిమీదట రభస అయి ఆమెను స్వగ్రామం పంపిస్తేగాని యిక్కడ వుండలేననీ, యీ అబద్ధం కుత్సితాలు భరించలేననీ మొండికెత్తింది సుశీల. 'ఎల్లాగో సర్దుకోవాలిగాని ఆమె ఎక్కడికిపోతుంది? కోరుకున్నట్లుగా లేదని ముక్కుకోసేసుకుంటారా? మన బాబుకే అబద్ధాలు అబ్బితే ఏం చేస్తావ్?' అన్నాడు భర్త. 'నాబిడ్డ అలాంటివాడు ఎన్నటికీ కాదు'అన్నది సుశీల. 'మన మంచి కోరేవాళ్లు మనల్ని కావాలనుకునేవాళ్లు అభిమానించేవాళ్లు యింకెవరూ లేరని గుర్తుపెట్టుకో. ఆమెను వెళ్లమని నేను చెప్పను' అన్నాడు భర్త. వీళ్లవాదనంతా విన్నదో లేదోగాని 'వంటయింది, భోజనానికి రండి' అని పిలవొచ్చింది ఆమె.

ఆమెకు కొడుకన్నా మనుమడన్నా ప్రాణమని సుశీలకూ తెలుసు. ఒక హద్దంటూలేని అబద్ధాలూ అల్పబుద్ధీ సుశీల ఏమాత్రం భరించలేకపోయింది. ఆ పంతంతోనే పుట్టింటికి వచ్చేసింది. ఇప్పటికీ ఎంత ఆలోచించినా సుశీలకు తన ప్రవర్తనలో తప్పు తోచటంలేదు. అయినా యిలా జరగవలసివచ్చినందుకు మనసంతా చీకాగ్గా మాత్రంవున్నది...

రైలు వేగంగా పరుగెడుతోంది. జేకబ్ షేవ్ చేసుకోవడం పూర్తయిపోయింది. నిద్రలేక బాధ పడుతూ యిరుక్కు కూర్చున్న మనిషితో బైరాగులను గురించీ దొంగసన్యాసులను గురించీ మాట్లాడుతున్నాడు పెద్దగా. 'ఒక దినం నేను ఎక్కిన కంపార్టుమెంటులో నలుగురు సాధువులు ఎక్కారు. వాళ్ళు ఏదేదో గొప్పవేదాంత చర్చలు చేస్తున్నారు. ఆత్మజ్ఞానం అంటూ మాట్లాడుతున్నారు. ఇంతలో టీసీ ఒచ్చాడు. టీసీని చూడగానే వేదాంతం ఆత్మజ్ఞానం ఎక్కడికిపోయ్యాయో మరి దొంగచూపులు చూస్తూ నోరు మూసుక్కూర్చున్నారు. బైరాగివాళ్ళ దొంగవేదాంతం అందరికీ తెలిసిందేగా. దరిదాపుల్లో వూరులేనిచోట మధ్య దారిలో రైలాపి వాళ్ళను దించేశాడు టీసీ. పక్కస్టేషన్లోనైనా దింపమని బ్రతిమాలారు. మళ్ళీ మాట్లాడితే గంజాయితోసహా కొట్లో తోయిస్తానన్నాడు టీసీ' అంటూ పెద్దగా నవ్వాడు. హిందూమతంమీద క్రిస్టియానిటీ ఆధిక్యత నిరూపించినట్లుగా గర్వపడిపోతూవున్నాడు.

జేకబ్ మాటలు విన్నట్లూ విననట్లూ కాకుండా అందరూ తగ్గుస్వరాల్లో నెమ్మదిగా మాట్లాడుకుంటున్నారు. అతను సబ్బు నురగలోంచీ కాఫీతోపాటుగా నోట్లోని పాచి నంతటినీ మింగాడని గుర్తొచ్చి అసహ్యంవేసింది సుశీలకు. తన మతంలోనిదీ ఆచారంలోనిదీ మంచీ చెడూ తెలియనివాడు, ఇతరులదంతా గొప్పని భ్రమించేవాడు— రాజువేషం వేసుకున్న వీధిభాగవతుడు తానే రాజు ననుకున్నట్లుగా ప్రవర్తించేవాడు - నల్లదొర! — ఆలోచించినకొద్దీ అతనిమీద చాలాకోపం వచ్చింది. ఒకరిలో తప్పులెన్నగలశక్తి యీతని కెక్కడిది అనుకున్నది.

జేకబ్ తన పాయింటుకు తానే మురిసిపోయాడు. ద్విగుణీకృతోత్సాహంతో 'అసలు యీ దేశంలో అందరూ అంతే...ఒకప్రక్క సన్యాసులూ యింకోప్రక్క దొంగమంత్రాల బ్రాహ్మలూ' అన్నాడు. చుట్టూ చూశాడు. ఎవరూ మాట్లాడలేదు, నవ్వనూ లేదు. అందరూ మాటలు మానేసి చూస్తున్నారు. రైలురొద తప్పించి మరే శబ్దంలేదు. కనీసం ఆ వేదాంత చర్చలు చేసేవాళ్ళయినా సమాధాన మిస్తారేమోనని చూసింది సుశీల. ఇహ వూరుకోలేక పోయింది.

'ఇందాకణ్ణుంచీ చూస్తున్నాను. సాధువులు, సన్యాసులు, దొంగబ్రాహ్మలూ అంటూ వూరికే మాట్లాడుతున్నారు. సాధువులూ, సన్యాసులూ అందరూ అబద్ధాలు చెప్తారనీ పనికిమాలినవాళ్ళనీ మీ వుద్దేశ్యమా? మంచీ చెడ్డా అన్నిచోట్లా వున్నై. మీ కాన్వెంటుల్లో వుండేవాళ్ళంతా వున్నత గుణాలు కలవాళ్ళేమీ కాదు. Judge not others lest ye be judged...' అన్నది పెద్దగా.

జేకబ్ మాట్లాడలేదు. సుశీలవైపు చూడను కూడా లేదు. ప్రక్కనున్న మనిషికేసి చూసి నవ్వాడు కనుబొమలు ఎగరేస్తూ.

సుశీలకు ఈసారి చాలాకోపం వచ్చింది. వుద్రేకంతో ఒణుకుతున్న గొంతుతో 'అతిపవిత్రమైన మీ కాన్వెంట్లను నే నెరుగుదును. అబద్ధాలూ కుత్సితమూ చాడీలూ రాజ్యం చేస్తాయి అక్కడ. సిస్టర్లమంటూ వేషం వేసుకున్నవాళ్ళకు కుళ్ళుబుద్ధులేమీ మారవనీ తెలుసు. వాళ్ళకంటే బైరాగులు ఎక్కువేమీ లేదు!...' అంటూ అరిచింది.

ఈసారికూడా జేకబ్ సమాధానమివ్వలేదు. ఈ మాటలు లెఖ్ఖచెయ్యనట్లుగా ప్రక్కనున్నతనితో చిన్నగా మాటలు ప్రారంభించాడు.

సుశీలకు అవమానంతో మొహం ఎర్రబడింది. ఇంకేంచెయ్యాలో తోచలేదు. పెట్టెలో అందరూ మాటలు మానేసి శ్రద్ధగా సుశీలమాటలు విన్నారు. అందరూ తననే బలపరుస్తున్నట్లుగా, తనవైపు సానుభూతి కలిగివున్నట్లుగా తోచింది సుశీలకు. 'అసలు నేను యీ మనిషితో వాదించి వుండకూడదు,

ప్రచారంచేసేవాళ్ళు మరీ low types' అనుకున్నది. ఓమూలనుంచి తాను ఎక్కువగా గౌరవించి ఇష్ట పడిన సిస్టర్స్ జ్ఞాపకంవచ్చి మనస్సు చివుక్కు మన్నది. తనమాటలు తనకే అబద్ధంగా తోచాయి. కాని అదంతా ప్రక్కకునెట్టింది. 'సిస్టర్స్‌గావుండీ వీళ్ల క్రోధ లోభ మాత్సర్యాలు ఒదల్లేదు, ఛీ' అని తాను ద్వేషించిన కొందరినిమాత్రం దృష్టిలో పెట్టు కున్నది. మనసులో కొరతవున్నా కోపంలో తన వాద నను సమర్థించుకోవటానికిగాను సగం నిజంమీదే ఆధారపడి మాట్లాడింది సుశీల. జేకబ్ ప్రవర్తనా, ఆలోచనా, రూపమూ అన్నీ వికారంగా కన్పించాయి సుశీలకు. ఇతర్లలో అన్యాయంగా తప్పులు వెతు కుతూ నిరాధారంగా నిందించే వాళ్లంటే సుశీలకు అసహ్యం.

టీసీ అప్రక్కనుండీ టికెట్లు చూచుకుంటూ వస్తున్నాడు. ఈ మాటల మధ్యలో బాబు ఎప్పుడో లేచి కూర్చున్నాడు. 'మనూరు ఏదమ్మా...నాన్న కావాలి' అన్నాడు. వాడికి మాటలు త్వరగా రావటమే కాకుండా స్పష్టంగా కూడా వస్తున్నాయి. టీసీ ఒచ్చాడు: 'మనూరు దగ్గరకొచ్చేసిందిలే' అంటూ పర్సులోంచి టికెట్‌తీసి చూపించింది. 'అబ్బాయి కెన్నేళ్ళు?' అన్నాడు. బెజవాడదగ్గర టీసీ చెప్పిన సలహా జ్ఞాపకం వచ్చింది. 'మూడో'ఏడు' అన్నది గభాల్న. 'కాదు...ఆ అబ్బాయి అయిదేళ్లవాడిలా కన్పి స్తున్నాడు.... ఫైన్‌తో టికెట్ తీసుకోవాలి' అన్నాడు టీసీ ఖచ్చితంగా. 'అబ్బాయికి మూడో'ఏడని చెప్ప లేదూ...' అన్నది సుశీల తలప్రక్కకు తిప్పేసుకుని. అబద్ధం చెబుతున్నందుకు కించకలిగింది.

పెట్టెలోవుండే వాళ్లంతా తననే చూస్తున్న ట్లనిపించింది. జేకబ్ నవ్వుకుంటున్నట్లనిపించింది. టికెట్ తీసుకోకుండా రైలెక్కిన సాధువులు మనసులో మెదిలారు. ఇంత అవమానకరమైన పరిస్థితిలో ఎలా చిక్కుకున్నాను! అనుకుంది ఆశ్చర్యంగా, అవమా నంతో క్రుంగిపోతూ. తానబద్ధం చెబుతోందో లేదో కూడా తెలియలేదు. అసలు అబద్ధం చెప్పవలసిన పరిస్థితి ఎందుకువచ్చిందో సరిగ్గా అరంకాలేదు. మనసు అల్లకల్లోలమూ అనిశ్చితమూ అయింది.

టీసీ గట్టిగా మాట్లాడుతున్నాడు. 'మీరు తల్లి గనుక ఏంచెప్పినా చెల్లుతుంది. కాని నిజ మేమిటో మీ మనసుకు తెలుసు. ఆ అబ్బాయికి అయిదేళ్ళు. మీరు కాదంటే నేనేం చెప్పగలను!' ఒకొక్కమాట ఒకొక్క సమ్మెటపోటులావుంది. ప్రపంచ మంతా ఒకట్టై 'అబద్ధం' అని నవ్వుతున్నట్లని పించింది.

పెట్టెలోనివాళ్లంతా నిశ్శబ్దంగా వింటు న్నారు. ఈసారి సుశీలకు సమాధానం చెప్పాలని అని పించలేదు. ఒక మనిషిని అనుమానించడం ఒకొక్కళ్ల కెంత సరదాగా వుంటుందో అనుకుంది నిస్పృహాయంగా వింటూ. ఆ జేకబ్ ఏమి వాగినా అందరిలా నోరు మూసుకొనివుండక తగుదునమ్మా అంటూ వాదనకు దిగవలసినపని తాను ఎందుకు చేసింది! అని తనను తానే తిట్టుకున్నది.

చెప్పాల్సిందంతా చెప్పేసి టీసీ వెళ్లిపోయాడు. కిటికీలోంచీ బయటకు చూస్తూ కూర్చుంది. పెట్టె లోనికి మొహం తిప్పలేక పోయింది సుశీల. 'టికెట్ లేని సాధువులకథ కంటే యింకా రసవత్తరంగా ప్రతీప్రయాణంలోనూ అందరికీ యీ కథ చెప్తాడు కాబోలు నల్లదొర! అందరి దృష్టిలోనూ ఎంత అపహాస్యంపాలై పోయేను!' అనుకుంటే కళ్లల్లో నీళ్లు తిరిగాయి. బలవంతాన ఏడుపు బిగబట్టుకుని కూర్చుంది.

కిటికీ బయటగా నేలా చెట్లూ కుప్పలూ టెలిగ్రాఫ్ స్తంభాలూ అన్నీ Straight line లో వెనక్కు పరుగెడుతున్నాయి. 'నా నీతిలాగా, నా పరువు లాగా' అనుకున్నది సుశీల. 'నీ ఆలోచన ఎప్పుడూ Straight line లో వుంటుంది. జీవితం అలా వుండదు' అన్నాడు భర్త ఓసారి మాటల్లో...

'ఆ పనికిమాలిన వాదన చెయ్యకుండా వుండి వుంటే!' అనుకుంది పదిసార్లు. 'తగుదునమ్మా అని ఎంతగా మాట్లాడింది!' అని అందరూ నవ్వు కుంటారన్న స్పృహ చాల బాధకలిగిస్తోంది. 'నేను అబద్దం చెప్పేనా? నిజమేమిటి? అబద్ధమేమిటి? ఒక్క నెలముందు వాడికి మూడో'ఏడు. ఇప్పుడు కాదు. నిజానికీ అబద్ధానికీ తేడా ఏమిటి?' అను కుంది సందేహంగా చెదిరిపోయిన మనస్సులో.

పెట్టెలో అందరూ ఒక్కసారిగా మాట్లాడటం ప్రారంభించారు. నిర్లిప్తంగా వింటూ కూర్చుంది సుశీల.

'డయాబిటిస్ తగ్గటమేమిటి! ఆరేళ్ళు చదివిన వైద్యమంతా ఏంచేశావ్?' అన్నాడు పై బెర్తుమీది సన్నటి డాక్టరు.

రెండో డాక్టరు నవ్వాడు. 'నేను డాక్టరు కాకముందు విషయం యిది. నాన్నగారిని ఒకరు కాదు యిద్దరు డాక్టర్లు పరీక్షించి డయాబిటిస్ అని తేల్చి చెప్పారుట. డయట్‌లో శ్రద్ధ తీసుకుని నాలుగేళ్ల తర్వాత మళ్లీ చూపించుకుంటే లేదన్నారట...తర్వాత ఆయన స్వేచ్ఛగా అన్నీ తింటూనే వున్నారు. నాకు తెలిసి యింకా ముగ్గురికి యిలానే జరిగింది' అన్నాడు.

'నాన్సెన్స్.....అంతా లూస్‌టాక్.....అసలు డయాబిటిస్ కాదేమో. అది ప్రొగ్రెస్సివ్ కండిషన్ అని తెలిసీ అలాంటి మాటలు నమ్ముతావా! సైన్స్ ఏమన్నాడో మరచి పోయావా' అన్నాడు మొదటి డాక్టరు.

'సైన్స్ ఏమన్నా అననీ, అదంతా ఏకారణం వలన వచ్చిందో ఆ కారణంగానే పోవచ్చును. మనిషిని బట్టి శాస్త్రం వచ్చిందా లేక శాస్త్రం ప్రకారం మనిషి వుంటాడా...' రెండో డాక్టరు తన అభిప్రాయం చెప్పాడు ఆవులిస్తూ...

క్రింది బెర్తులో ఆచివర కూర్చున్నవాళ్లు ముగ్గురూ మళ్లీ వేదాంతం మొదలెట్టారు.

'మా వూరి ఆశ్రమంలోని అమ్మగారు భావం నశించిన శుష్కమైన నియమనిష్ఠలవలన ప్రయోజనం లేదన్నారు. మంత్రోపాసన యీ కాలధర్మంలో అనర్థాలకు దారితీస్తున్నదన్నారు...ఇహ ముక్తి మార్గం ఏమిటమ్మా అనడిగితే అంతా ఆ భగవంతుడే చూసుకుంటాడు అన్నారు' లావుకాలిమనిషి అన్నాడు.

తెల్లగా పొడుగ్గా వుండే మనిషి విసుగ్గా 'ఏమిటయ్యా నీవనేది? సాధన ఏమీ చెయ్యకుండానే ముక్తి దొరుకుతుందనా? నియమనిష్ఠలు పాటిస్తూ సాధనచేసి ఎన్నోజన్మలెత్తి పరోపకారాది సద్గుణాలు పొంది బతుకే ఒక తపస్సుగాచేస్తే తప్ప భగవద్దర్శనంకాదు...' అన్నాడు.

కాషాయబట్టలతను 'నారాయణ...నారాయణ...' అంటూ జపం ప్రారంభించేడు.

లావుకాలి మనిషి యింకా సందేహంగానే 'నియమ నిష్ఠలవల్ల అనుగ్రహం లభించి తీరుతుందంటారు. అప్పుడిహ అనుగ్రహం ఏమున్నదీ! నియమనిష్ఠలే దేవుడు!... అయినా భగవంతుడు సులభసాధ్యుడనీ భక్తవత్సలుడై వున్నవాడనీ అంటారే, ఇంత కఠినుడంటూరా...ఆయన తలచుకుంటే యివన్నీ లేకుండానే అనుగ్రహించడా?' అన్నాడు.

మొదటివ్యక్తి అసహనంతో 'ఏమిటయ్యా నీ గొడవ...భగవంతుడు ఇహనుండి పద్ధతి మార్చుకొని అల్లాటప్పగాళ్లకే ప్రత్యక్ష మౌతాడనేట్లున్నావు' అని కసురుకున్నాడు.

ఇంతలో యీ చివర కూర్చున్న స్టూడెంట్లు పెద్దగా నవ్వారు ఎందుకో. 'బారాహాత్ వెళ్లి దో అంఖోఁతో చూసి ఇనపగొలుసులు తెచ్చి కాళ్లమీద వేసుకున్నాకనే నిద్రొచ్చింది...' ఒకబ్బాయి హాస్యంగా అన్నాడు...

పెట్టెలోని మనుష్యులందరూ వుత్సాహంగోలగా మాట్లాడుతున్నారు. ఆ మాటలన్నీ తల త్రిప్పకుండా వున్న సుశీల చెవుల్లోంచీ దూరి మనసులో నాట్యం చేస్తున్నాయి. ఇంతవరకూ ప్రపంచం తనమీద మోపిన భారమంతా పోయి మనసు తేలికైనట్లు, ప్రపంచం గాలిలో తేలిపోతున్నట్లు అనిపించింది. 'నిజమేమిటి? అబద్ధమేమిటి? నేను అబద్ధంకాదు!' అనుకున్నది. కళ్లుపైకెత్తి దూరానికి చూచింది. అప్పుడే సికింద్రాబాదు వచ్చేసినట్లుంది. ఇళ్లూ మేడలూ ప్రపంచం అంతా వుదయకాంతిలో స్పష్టమైన ఆకారాలు ధరించి అందంగా అల్లిబిల్లి తిరుగుతున్నాయి.

రైలాగింది. ప్లాట్‌ఫారం మీదినుంచీ అత్తగారు ఆత్రంగా లోనికి చూచి 'అదేమిటవ్వాయ్! ఇంకా

హెూల్డాలు కట్టలేదూ?...బాబులూ! లేచికూర్చున్నావా' అంటూ హడావుడి పడుతూ లోనికి వచ్చింది. ఆప్యాయమైన ఆ పలకరింపుతో సుశీల బరువు తీరినట్లు నిట్టూర్చింది. పెట్టెలోనికి చూడటానికి మొహమోటం కలుగలేదు. పెట్టెలోని మనుషులు చాలావరకు ఎప్పుడో సామాన్లు కట్టేసుకున్నారు. హడావుడిగా లేచి కూలీల్ని పిలిచి సామాన్లు దింపమని పురమాయిస్తున్నారు.

లావుకాలి మనిషి కాలిమీదున్న మందపాటి తెల్లదుప్పట్లు మడవటానికి తీశాడు. సుశీలకు అతని కాలు చూస్తే ఆశ్చర్యమూ సంతోషమూ కలిగాయి. కాలు మామూలుగానే వున్నది! రెండు దుప్పట్లమీద నుండటాన దూరాన్నించీ లావుగా కన్పించింది, అంతే!

టాక్సీలో యింటికి వెళ్తుంటే అత్త చెబుతోంది: 'మనూరికెళ్తే వుండ బుద్ధికాలేదమ్మాయ్.. ఒక్కదాన్నే బిక్కుబిక్కుమంటూ...అందులో ఆ పాడు నీళ్లు నా ఒంటికి పడలేదు. ఒహటే విరేచనాలు. తల్లక్రిందులై పోయాననుకో...ప్రొద్దుటే అబ్బాయి స్టేషను కొస్తానని చెప్పి ఒహటే నిద్ర. వాడిని లేపట మెందుకని నేనే ఒచ్చాను'.

ఆ వూళ్లో విరేచనాలయిన విషయం అబద్ధం అయివుంటుంది. స్టేషనుకు నేనే వెళ్తానులేరా అని కొడుకుతో చెప్పివుండొచ్చు. ఆయన అలారం పెట్టుకుంటే ఆమె మెల్లిగా తీసేసీ వుండొచ్చు అనుకున్నది సుశీల. కోపం రాలేదు. నవ్వొచ్చింది.

సుశీలకు కన్పించకుండా చేతిరుమాల్లోంచీ నాలుగు చాక్లెట్లు తీసి బాబు చేతిలో పెట్టింది ఆమె రహస్యంగా. అన్నం తిన్నాక తప్పించి బాబుకు స్వీట్సు ఛాక్లెట్స్ యివ్వకూడదని యిప్పటికి వెయ్యిసార్లు చెప్పివుంటుంది సుశీల......

